తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) 1988 ఉగాంది మినీ కథలపోటీలో
బహుమతి పొందిన కథ

# ఒక్క బొచ్చు

కొలనీలో ఇళ్ళు కట్టిస్తున్నాడు కాంట్రాక్టర్ కామేశ్వరరావు. పనివాళ్ళందరూ హడావిడిగా పనిలో మునిగితేలుతున్నారు. అందర్నీ అజమాయిషీ చేస్తూ పనిపరికిస్తూ పచార్లు చేస్తున్నాడు కామేశ్వరరావు.

ఎండాకాలం కావటాన పనివాళ్ళకోసం ఏర్పాటు చేసుకున్న మంచినీళ్ల ఎన్ని తెచ్చుకున్నా సరిపోవటం లేదు. ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరటం లేదు.

ఇటుకలు అందిస్తున్నారు కొందరు. ఇటుకలు అమరుస్తూ గోడలు కడుతున్నారు ఇంకొందరు. ఓ పక్కగా సిమెంటు, ఇసుం పారలతో తిరగ కలుపుతున్నారు. కొంతమంది సిమెంటు బస్తాలు గదిలోనుండి జారవేస్తున్నారు. అందరి పని పరిశీలిస్తూ, పురమాయిస్తూ వున్నాడు కామేశ్వరరావు.

సరిగ్గా అప్పుడే జీపువచ్చి ఆగింది. వినయంగాచేతులు జోడించాడు కామేశ్వరరావు జీపు దగ్గరగా వెళ్ళి. హుందాగా దిగిన ఇంజనీరు గారు చూపుడువేలు అలా గాల్లో కదిలించారు కామేశ్వరరావు నమస్కారానికి బదులుగా,

ఓ పని కుర్రాడ్ని పిలిచి రెండు కొబ్బరి బొళ్ళాలు తెమ్మని పంపాడు కామేశ్వరరావు.

గంభీరంగా పనిదగ్గరకు నడిచాడు ఇంజినీరు. అనుసరించాడు కామేశ్వరరావు.

"ఏమయ్యా ఓ బస్తా సిమెంటుకు ఎన్ని బొచ్చలు ఇసుక పోస్తున్నారు" పనివాళ్ళని అడిగాడు ఇంజనీరు.

"పదారండి" పార కలుపుతునే చెప్పాడు. "ఆఁ పదహారు బొచ్చలా ఏమయ్యా కామేశ్వర్రావ్ ఈ కొంపలన్నీ కనీసం ప్రారంభోత్సవం వరకైనా పదిలంగా వుండటానికేనా... ఒక్క బస్తా సిమెంటుకు పదహారు బొచ్చల ఇసుకా! ఇలా అయితే నేను ఒక్క బిల్లుకూడా పాస్ చేయను. నీ యిష్టం. మరీ అడ్డగోలుగా వుంది నీ వ్యవహారం" అంటూ కస్సుబుస్సుమన్నాడు ఇంజనీరు.

కామేశ్వరరావు మెత్తగా నవ్వేడు, మెల్లగా నవ్వేడు. ఓ రాజకీయపు నవ్వు విసిరేడు.

"అయ్యా మీరు చెప్పింది రైటే. నేకాదనడం లేదు. ఇప్పటి కాడ్నించి మీరు చెప్పిన లెక్క పెకారం, మీ ఎస్టిమేషన్ల ప్రకారం ఎన్ని బొచ్చెలు ఇసుక కలిపించమంటే అన్ని కలిపిస్తా. అందుకు మీ రెంతమందిని నిఘా పెట్టినా నాకు అభ్యంతరం లేదు. మీరెప్పుడు వచ్చినా నేను మీరు చెప్పిన లెక్కప్రకారం కలిపిత్తన్నానో లేదో కనుక్కోండి. కాకపోతే నాదొక్క చిన్న మనవి." మళ్ళీ యికిలించాడు కామేశ్వరరావు. "ఏమిటది" విసుగ్గా, విసుదుగా అడిగాడు ఇంజినీరు.

"మీరు చెప్పిన ఎనిమిది బొచ్చల మీద ఒకే ఒక్క బొచ్చ పాపం మా వార్డు కౌన్సిలర్ గారికి. ఒకే ఒక్క బొచ్చ మన సూపర్ వైజర్ గారికి. ఒక్కటంటే ఒక్క బొచ్చే జూనియర్ ఇంజినీరు గారికి, ఒక్క బొచ్చ పెద్ద ఇంజినీరు అయ్యగారికి, ఒక్క బొచ్చ కమీషనర్ గారికి, మరి ఉదయం నుంచి సాయంత్రం వరకు మీ తరఫున ఇక్కడ పడుండే యన్నెమ్మార్ కుర్రోళ్ళిద్దరికీ కలిపి ఒక బొచ్చ, ఇక చెప్పాల్సిందేముంది సారూ, ఇంతగా కష్టపడుతున్న తమరిగోరికీ ఒకే ఒక్క బొచ్చే. ఇంత మందికీ తలా ఒక బొచ్చ ఇచ్చినందుకు గానూ నాకోసం నేను అడుగుతున్నది ఒకే ఒక్క బొచ్చే సారు."

"ఇప్పుడు లెక్క చూసుకుని ఎన్ని బొచ్చలు కలపమంటారో సెప్తే ఇకనుండి మీరు సెప్పినట్టే, అన్ని బొచ్చలు కలిపిత్తాను." అంటూ ఇంజినీరు కళ్ళలోకి చూశాడు కాంట్రాక్టర్ కామేశ్వరరావు.

"ఎటాగోట్లా చెయ్" అంటూనే అక్కడ్నించి వెళ్ళిపోయాడు ఇంజినీరు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక డి. 27-5-88)